ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
శనివారం 24 ఫిబ్రవరి 2024



సమ్మక్క-సారలమ్మకు మొక్కులు చెల్లిస్తున్న ఎంపీ బండి సంజయ్

● మొక్కులు చెల్లించిన ఎంపీ బండి సంజయ్, మేయర్ సునీల్‌రావు

రేకుర్తి, చింతకుంటలో సమ్మక్క సారలమ్మలకు కరీంనగర్ ఎంపీ, బీజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ మొక్కులు చెల్లించారు. సమ్మక్క సారలమ్మలకు నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ తదితరులు పాల్గొన్నారు. జాతరలో మేయర్ యాదగిరి సునీల్‌రావు అపర్ణ దంపతులు మొక్కులు చెల్లించుకున్నారు.

● నేడు అమ్మవార్ల వనప్రవేశం

రెండు సంవత్సరాలకొకసారి జరిగే జాతరలో భాగంగా మూడు రోజులుగా సాగిన సమ్మక్క సారలమ్మజాతర శనివారంతో ముగియనుంది. అమ్మవార్లు శనివారం మధ్యాహ్నం నుంచి వనప్రవేశం చేయనున్నారు. చివరి రోజు కావడంతో శనివారం కూడా రద్దీగా ఉండనుంది.



రేకుర్తి సమ్మక్కసారలమ్మ జాతరకు దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు

రేకుర్తిలో బంగారం(బెల్లం)తో భక్తురాలు

తల్లులారా వందనం

సమ్మక్క సారలమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

● జనసంద్రమైన రేకుర్తి

● అమ్మవార్లను దర్శించుకున్న ప్రజా ప్రతినిధులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 23: వనదేవతలు గద్దెలపై కొలువు దీరడంతో శుక్రవారం సమ్మక్క-సారలమ్మల జాతర జనసంద్రమైంది. తల్లులారా వందనం అంటూ భక్తులు భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి భక్తులు జాతర ప్రాంగణంలోని కెనాల్‌లో స్నానాలు ఆచరించి అమ్మవార్లను దర్శించుకునేందుకు బారులు తీరారు. భక్తులు నిలువెత్తు బంగారం, కొబ్బరికాయలు, తలనీలాలు, ఎదుర్కోళ్లు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 9 గంటల సమయంలో దర్శనం కోసం ఒక్కసారిగా భక్తులు రావడంతో స్వల్ప తోపులాట జరిగింది. సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు దర్శనం సుమారు 3 గంటల సమయం పట్టింది. భక్తుల తాకిడి, తోపులాటలో కొంత మంది భక్తులు బయట నుంచి మొక్కులు చెల్లించారు. జాతర రోడ్లన్నీ జనంతో కిక్కిరిసి పోయాయి. జాతర కమిటీ చైర్మన్ పిట్టల శ్రీనివాస్, జాతర అధికారి ఎండపెల్లి మారుతి, ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్ గుడికాడి శ్రీనివాస్ తదితరులు జాతరలో ఏర్పాట్లు పరిశీలించారు.

• చింతకుంటలో...

చింతకుంటలోభక్తులు భారీ సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జాతర వ్యవస్థాపకులు ఎల్లమ్మ, తిరుపతి, జాతర అధికారి నాగుల అనిల్‌కుమార్, క్లర్క్ పాత మహేశ్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్ : ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ మండలంలో జూపాక గ్రామంలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతరను దర్శించుకునేందుకు మంత్రి హోదాలో తొలిసారి రాగా, నాయకులు, కార్యకర్తలు భారీగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తులభారం ద్వారా ఎత్తు బంగారం సమర్పించుకున్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ తదితరులు ఉన్నారు. హుజూరాబాద్ శివారులోని రంగనాయకుల గుట్ట సమీపంలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మలను శుక్రవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకున్నారు.

చొప్పదండి : చొప్పదండి మండలంలో సమక్క జాతర వైభవంగా జరుగుతుంది. శుక్రవారం గద్దెపై సమ్మక్క, సారలమ్మ ఉండడంతో భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. చొప్పదండిలోని రాగంపేట, గుమ్లాపూర్ గ్రామాల్లో జాతర వైభవంగా సాగుతుండగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బంగారాన్ని సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

గంగాధర: నియోజకవర్గ ప్రజలకు సకల సంతోషాన్ని కల్గించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా గంగాధర మండ లం బూరుగుపల్లి, మధురానగర్ గ్రామాల్లో వనదేవతలను దర్శించుకుని నిలువెత్తు బంగారాన్ని సమర్పించుకున్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల ఎంపీటీసీలు, జడ్పీటీసీ పుల్కం అనురాధ నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రామడుగు: రామడుగు, గుండి గోపాల్‌రావుపేట, తిరుమలాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న జాతర భక్తులతో పోటెత్తింది. గద్దెలపై కొలువుదీరిన దేవతలను సందర్శించడానికి వేలాదిమంది భక్తులు తరలి రావడంతో జాతర ప్రదేశాలు నిండిపోయాయి. స్థానిక ఎమ్మె ల్యే మేడిపల్లి సత్యం వన దేవతలకు బంగారాన్ని సమ ర్పించి మొక్కులు చెల్లించు కున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అమ్మవార్లను దర్శించుకున్నారు.



కేశవపట్నం సమ్మక్క-సారలమ్మ జాతరలో కిక్కిరిసిన భక్త జనం

శంకరపట్నంలో భక్తుల రద్దీ

శంకరపట్నం: గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మలను కోరిన కోరికలు తీర్చాలని జనం మదినిండా కొలచి, మొక్కులు అప్పజెప్పారు. శంకరపట్నం మండలంలోని కేశవపట్నంతో పాటు ఆముదాలపల్లి, గద్దపాకలో గద్దెలపై కొలువు దీరిన వన దేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శనం చేసుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కేశవపట్నంలో శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలకు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరై తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అలాగే మండలంలోని కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి జాతరకు వినోద్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, నాయకులు పాల్గొన్నారు.

మానకొండూర్ : మండలంలోని లింగాపూర్, వేగురుపల్లి, దేవంపల్లి, కొం డపల్కల గ్రామాలలో జరిగిన సమ్మక్క-సారలమ్మ వనదేవతల జాతర వైభవంగా జరిగింది. తండోపతండాలుగా తరలివచ్చి అమ్మవారలను దర్శించు కొని మొక్కులు చెల్లించుకున్నారు. దేవంపల్లి, కొండపల్కల గ్రామాలలో బీఆ ర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్ వ నదేవతలను దర్శించుకున్నారు.

గన్నేరువరం: మండలంలోని మైలారం, గన్నేరువరం గ్రామాలలో నిర్వహించిన సమ్మక్క సారలమ్మ జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. గురువారం రాత్రి వరకు సమ్మక్క సారలమ్మ దేవతలు గద్దెల పైకి చేరుకోవడంతో భక్తుల మొక్కులు చెల్లింపులు ప్రారంభ మయ్యాయి. ఎత్తు బంగారం, ఎదురుకోళ్లను సమర్పించి మొక్కులు చెల్లించారు. తహ శీల్దారు భిక్షపతి, ఎంపీడీవో శంకర్, ఆర్ఐ రజనీకుమార్ జాతరను పరిశీలించారు. వివిధ పార్టీల నాయకుల అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు.



మొక్కులు చెల్లించేందుకు వస్తున్న ట్రాన్స్‌జెండర్‌లు

సైదాపూర్: మండలంలోని సైదాపూర్-జాగీర్‌పల్లి మధ్య ఊరగుట్టపై, వెన్నంపల్లి గ్రామ శివారులో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల గ్రామంలో కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మలను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



రేకుర్తిలో యువతుల మొక్కులు



వీణవంకలో అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రణవ్

సమ్మక్క-సారలమ్మల పోరాటమే స్ఫూర్తి

● రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

వీణవంక, ఫిబ్రవరి 23: నియంతృత్వానికి వ్యతిరేకంగా సమ్మక్క-సారలమ్మలు ఏ విధంగా పోరాటం చేశారో ఆ విధంగా ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం వీణవంక మండల కేంద్రంలోని శ్రీసమ్మక్క-సారలమ్మ జాతరలో వనదేవతలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్‌తో కలిసి మంత్రి పొన్నం దర్శించుకున్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం కూలిపోతుందని ఒకడు.. కులగొడుతామని ఒకడు.. ఏదీ పడితే అది నోటికచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ప్రజాపరిపాలన మీద కొంత మంది 70రోజులు కాకముందే ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. మేము ఐదేళ్ల అమ్మవారి, ప్రజల ఆశీర్వాదంతో ప్రజల భాగస్వామ్యంతో పరిపాలిస్తామన్నారు. బీజేపీ అధికారంలో పదేళ్ల తెలంగాణకు ఏం చేసిందో వారి గుండె మీద చేయి వేసుకొని చెప్పాలన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ అధికారంలో ఉండి ఇచ్చిన హామీలు నెరవేర్చారా అన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలన నియంతృత్వంలో సాగిందన్నారు. రాబోయే కాలంలో సమృద్ధిగా వర్షాలు పడి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బాగుండాలని అమ్మవార్లను కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డి, పత్తి కృష్ణారెడ్డి, యూఫ్ టీవీ సీఈవో పాడి ఉదయనందన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చింతల శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రేకుర్తి కెనాల్‌లో స్నానమాచరిస్తున్న భక్తులు



కేశవపట్నంలో శివసత్తుల పూనకాలు



మొక్కులు చెల్లిస్తున్న మేయర్ సునీల్‌రావు దంపతులు



హుజూరాబాద్‌లోని రంగనాయకుల గుట్టలోని అమ్మవార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



చొప్పదండి మండలంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మొక్కులు

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

● జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 21: జిల్లాలో ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఐదు రోజుల ముందే పరీక్షా కేంద్రాలకు వెళ్లి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి.జగన్మోహన్‌రెడ్డి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులకు సూచించారు. శుక్రవారం డీఐఈవో కార్యాలయంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్, ఇన్విజిలేటర్లు, తాగునీరు, సీసీ కెమెరా, మరుగుదొడ్లు, లైటింగ్ వంటి వసతుల్లో ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారులకు తెలియజేసి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పరీక్షలను నిర్వహించాలని అన్నారు. హాల్ టికెట్లు, కళాశాల నామినల్ రోల్స్, పరీక్షా కేంద్రాలకు సంబంధించిన పరీక్షల సామగ్రిలను వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసి ప్రింట్ తీసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సమాధాన పత్రాలు, ఓఎంఆర్ బాక్స్‌లు, ఫొటో అటెండెన్స్ తదితర సామగ్రిని డీఐఈవో కార్యాలయం, పద్మనగర్ నుంచి అన్ని పరీక్షా కేంద్రాలకు పంపిణీ పూర్తయిందని తెలిపారు. సంబంధిత పరీక్షల సామగ్రిని పరిశీలించి ఏమైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈసీ-1, కె.రవీందర్‌రెడ్డి, డీఈసీ-2 వి.ఆంజనే యరావు, డీఈసీ-3 కేదారీశ్వర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శశిధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి.జగన్మోహన్‌రెడ్డి

కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత

• బలహీనపడిన బీఆర్ఎస్

• బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై స్వల్ప వ్యవధిలోనే ప్రజా వ్యతిరేకత వచ్చింది. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా బలహీనపడిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చైతన్యపురి శ్రీమహాశక్తి దేవాలయ సమీపంలో రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంజయ్ శ్రీకారం చుట్టారు. అనంతరం ఎంపీ కార్యాలయానికి వెళ్లి పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ సర్వే నివేదికలు చూసినా బీజేపీయే ముందంజలో ఉందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచే స్థానాల్లో కరీంనగర్ నెంబర్ వన్ స్థానంలో ఉందని అన్నారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై అతి తక్కువ సమయంలోనే ప్రజా వ్యతిరేకత నెలకొందని అన్నారు. హామీల అమలుకు తగిన బడ్జెట్ లేదని, వాటిని అమలు చేసే పరిస్థితిలో రేవంత్ సర్కార్ లేదని ప్రజలకు అర్థమైందని చెప్పారు. దేశవ్యాప్తంగా మోదీ మళ్లీ ప్రధాని కావాలని ప్రజలు కోరుతున్నారని, కరీంనగర్‌లో నూ ప్రజలు కమలం పువ్వు గుర్తుపై ఓటేసేందుకు సిద్ధమ య్యారని సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజాహిత యాత్రలతో బీజేపీ నాయకులు, కార్యకర్తలంతా గ్రామాలకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేయడంతో పాటు మోదీ సాధించిన విజయాలను గుర్తు చేస్తూ అత్యధిక మెజార్టీతో బీజేపీ గెలిచేలా కృషిచేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ డి.శంకర్, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

రాజన్న సేవలో పీఎఫ్ కమిషనర్

వేములవాడ ఫిబ్రవరి 23 : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రావిడెంట్ ఫండ్ సౌత్ జోన్ అడిషనల్ సెంట్రల్ కమిషనర్ వైశాలి దయాల్ దర్శించుకున్నారు. శుక్రవారం ఆమె కోడె మొక్కు చెల్లించుకుని శ్రీ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం గావించారు. ఆలయ ఏఈఓ ప్రతాప నవీన్ శ్రీస్వామి వారి ప్రసాదం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్, గోలి శ్రీనివాస్, అరుణ్ తదితరులు ఉన్నారు.



ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈఓ నవీన్

సిరిసిల్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 23: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లో 40 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని మున్సిపల్ సిబ్బంది తరలించారు.

మంటలు అంటుకుని చెట్లు దగ్ధం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 23: కొత్తపల్లి మండలం నాగుల మల్యాల గుట్టపై చెట్లకు మంటలు అంటుకుని దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పుతున్నారు. రాత్రి వరకు మంటలు అదుపులోకి వచ్చాయని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

వైభవంగా నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

కొడిమ్యాల, ఫిబ్రవరి 23: మండలంలోని నల్లగొండ నృసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం నిర్వహించు రథోత్సవానికి భక్తులు తరలివస్తున్నారు. శుక్రవారం స్వామి వారిని గజవాహనంపై ఊరేగించారు. ఉదయం నుంచి భక్తులు ఎగువ, దిగువ ఆలయాల్లో నృసింహస్వామిని దర్శించుకొని స్వామి వారికి పట్టెనామాలు కోరమీసాలు సమర్పించుకున్నారు. స్వామి వారిని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులు చలువ పందిళ్ల కింద సేద తీరుతున్నారు. ఆలయ చైర్మెన్ సత్యనారాయణ రావు, ఈవో అనూషతో పాటు సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

తహసీల్దార్‌పై కేసుతో కలవరం

- సీఐ నటేష్‌పై సీపీ రిపోర్ట్‌తోనే సస్పెన్షన్ వేటు?
- పలువురు పోలీసు, ఇతర శాఖల అధికారులకు నోటీసులు


కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 23: కోర్టులో పెండింగ్‌లో ఉన్న వివాదానికి సంబంధించిన భూమిని నిందితులతో కుమ్మక్కై మ్యుటేషన్ చేసినట్లు ఆరోపణలపై గతంలో కొత్తపల్లి తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన చిల్ల శ్రీనివాస్‌పై కొత్తపల్లి ఠాణాలో మంగళవారం కేసు నమోదు కావటం కలకలం సృష్టించింది. ఈ కేసులో విచారణకు హాజరుకావాలంటూ తహసీల్దార్‌కు మూడు రోజుల కిందట కరీంనగర్ రూరల్ పోలీసుల సీఆర్‌పీసీ 160 కింద నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న తహసీల్దార్ శుక్రవారం ఉదయం 11 గంటలకు కరీంనగర్ రూరల్ సీఐ కార్యాలయంలో హాజరు కావాల్సి ఉన్నది.

అయితే శుక్రవారం ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేసి తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై అరెస్టు చేయకుండా గురువారం వరకు మినహాయింపు పొందినట్లు తెలిసింది. మరో వైపున జగిత్యాల టౌన్ సీఐ సిహెచ్ నటేష్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆయన గతంలో కరీంనగర్ ఒక టో ఠాణా సీఐగా పనిచేసిన సమయంలో పలు భూవివాదాలకు సంబంధించి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. సీఐపై కరీం నగర్ సీపీ రిపోర్టు తయారు చేసి ఐజీకి పం పించారని ఈ నేపథ్యంలో ఆయనపై విచారణ జరిపి సస్పెన్షన్ వేటు వేశారని తెలిసింది. రెండు నెలల కిందట కూడా పలు ఆరోపణ లపై కరీంనగర్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సీఐలపై సీపీ, ఐజీకి రిపోర్ట్ పంపించి బదిలీవేటు వేసిన విషయం విదితమే. కరీంనగర్‌లో భూకబ్జాలకు సంబం ధించి ఇప్పటి వరకు 7 కేసులు నమోదుకాగా 13 మంది అరెస్టు అయ్యారు.

● సీపీ, కలెక్టర్ బదిలీ తప్పుడు ప్రచారంపై నిఘా

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లు బదిలీ అయ్యారంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి వైరల్ చేయడంపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ దుష్ప్రచారాన్ని ఎవరు చేస్తున్నారు? ఎవరు చేయిస్తున్నారనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇటీవల కొందరు భూకబ్జాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టుకాగా వారి అనుచరులుగా చెప్పకుంటున్న కొంతమంది యువకులు ఈ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు పోలీసులు ఇప్పటికే గుర్తించి చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.



భూ విక్రయంలో మోసం చేసి, బెదిరింపులు

- ముగ్గురిపై కేసు, ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 23: భూమి విక్రయంలో మోసం చేయటమే కాకుండా చంపుతానని బెదిరింపుల కు పాల్పడిన ఘటనలో జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న దుర్గం జగన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు నందెల్లి మహిపాల్,సదాశివపల్లికి చెందిన సింగిరెడ్డి వెంకటరమణారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు మానకొండూర్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్‌టీపీసీలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొంది ప్రస్తుతం కరీంనగర్ భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎల్లాల అజేందర్‌రెడ్డి 2019లో మానకొండూర్ మండలం సదాశివపల్లిలోని సర్వే నెంబరు 442, 447/2, 443లలోని మూడెకరాల అరగుంట భూమిని కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన దుర్గం జగన్‌గౌడ్, తిరుపతి అనే వ్యక్తి ద్వారా కొనుగోలు చేశాడు. ఆ తరువాత ఆ భూమిలోకి వెళ్లిన అజేందర్‌రెడ్డిని, సింగిరెడ్డి వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి అడ్డుకుని ఆ భూమి తనదేనని చెప్పటంతో ఇద్దరి మధ్య భూవివాదం తలెత్తింది. ఈ విషయంపై మాట్లాడేం దుకు అజేందర్‌రెడ్డిని సదాశివపల్లికి పిలిచిన దుర్గం జగన్‌గౌడ్, నందెల్లి మహిపాల్, సింగిరెడ్డి వెంకటరమణారెడ్డి ముగ్గురు కలిసి అజేందర్‌రెడ్డిని చంపుతానని బెదిరించారు.

మోసపోయిన బాధితుడు అజేందర్‌రెడ్డి శుక్రవారం మానకొండూర్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు ముగ్గురు నిందితులపై ఐపీసీ 420, 467, 386, 506, 120-బి రెడ్‌విత్ 34 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ కేసులో దుర్గం జగన్‌ను శుక్రవారం అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.



వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా వసంతోత్సవం

బీర్‌పూర్, ఫిబ్రవరి 23: బీర్‌పూర్ లక్ష్మీనరసింహా స్వామి జాతర బ్రహ్మోత్స వాలలో భాగంగా శుక్రవారం లక్ష్మీ నరసింహులకు వసంతోత్సవం కార్యక్రమాన్ని వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉత్సవ ముహూర్తులను ప్రత్యేకమైన వేదికపై ఆశీనులగావించి వేదమంత్రోచ్ఛరణల మధ్య వసంతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, కెడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచంధర్ రావ్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటి మెంబర్ ఎనగంటి సామ్రాట్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సంతోష్, సిబ్బంది రాజయ్య, వెంటేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్యాక్స్ డైరెక్టర్ మృతి



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 23: మండల సహకార సంఘం డైరెక్టర్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి (45) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌రెడ్డి గురువారం సాయంత్రం కరీంనగర్‌కు వెళ్లి ద్విచక్రవాహనంపై మండలంలోని పొత్తూర్‌కు తిరిగి వస్తుండగా కమాన్‌పూర్ వద్ద గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌రెడ్డిని కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ సిద్దం శ్రీనివాస్, ఎంపీటీసీ పట్నం అశ్వినీశ్రీనివాస్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ సౌమ్యుడు శ్రీనివాస్‌రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామన్నారు.

పంది అడ్డురావడంతో బైక్ నుంచి పడి..

కరీంనగర్ క్రైం: కొత్తపల్లి మండల కేంద్రంలోని ఓ రెస్టారెంట్ ఎదురుగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన ఎండీ ఖలీల్లా(35) అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖలీల్లా తన ద్విచక్రవాహనంపై వెళుతుండగా పంది అడ్డురాగా అదుపుతప్పి కిందపడటంతో తలకు బలమైన గాయాలై మరణించాడని తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని రైతు..



గౌరు రాజయ్య(ఫైల్)

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం రాళ్లపేట శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాళ్ల పేట గ్రామానికి చెందిన గౌరు రాజయ్య (52) అనే రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం రాత్రి రాజయ్య తన పొలం వద్ద నుంచి గేదెను తీసుకొని ఇంటికి వస్తున్నాడు. వెనక నుంచి ప్యాసింజర్ ఆటో ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి..

కరీంనగర్ క్రైం: భగత్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో తన సోదరుడి గృహప్రవేశం సమయంలో ప్రమాదవశాత్తుగా కాలుజారి కిందపడి ఈదులగట్టెపల్లికి చెందిన మీస రాంచంద్రం(46) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న భవనం మూడో అంతస్తు పైనుంచి కిందపడడంతో రాంచంద్రంకు తీవ్రగాయాలయ్యాయన్నారు. అతన్ని వెంటనే కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి, హైదాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం రాత్రి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడు ఆర్టీసీ డిపో-1లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 23: హైదరాబాద్‌లోని బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన షెడ్యూల్ కులాల బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి ఇంగ్లీష్ మీడియంలో రెండు సీట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, 2017 జూన్ 1 నుంచి 2018 మే 31 మధ్యలో జన్మించిన బాల బాలికలు ప్రవేశాలకు అర్హులని అన్నారు. వారి తల్లిదండ్రుల వార్షిక ఆదా యం గ్రామీణ ప్రాంతాల వారికి లక్షా 50 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల మించరాదని, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రం సంబంధిత తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లనుంచి పొం దాలని సూచించారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను మీసేవ, మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి పొందాలని, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుల జిరాక్సు ప్రతులపై గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి దరఖాస్తుతో పాటు జత చేయాలని సూచించారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుంచి ఈనెల 25 నుంచి మార్చి 12వ తేదీ వరకు అన్ని పనిదినాల్లో పొంద వచ్చన్నారు. దరఖాస్తులను మార్చి 12న సాయంత్రం ఐదుగంటలలోపు రెండు పాసుపోర్టు సైజు ఫొటోలతో జతచేసి సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అంజన్న పైసలేవీ..?

- ఖాతాకు చేరని రూ.37.90లక్షల టెండర్ సొమ్ములు
- కొండగట్టులో అధికారుల నిర్వాకం



మల్యాల, ఫిబ్రవరి 23: కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో నిర్వహించే వివిధ దుకాణాల టెండర్‌దారులు చెల్లించే డబ్బులు అంజన్న ఖాతాకు చేరకపోవడం తీవ్ర దుమారం లేపుతోంది. వ్యాపారులు తమ టెండర్ సొమ్ములను దేవస్థానానికి విడతల వారీగా చెల్లిస్తుండగా 2023-24 సంవత్సరానికి గాను కొందరు వ్యాపారులు దేవస్థానం అధికారు లకు చెల్లించారు. వాటికి రశీదులు కూడా ఇవ్వగా ఆ డబ్బులు మాత్రం దేవస్థానం ఖాతాలో చేరలేదు. ఇటీవల దీనిపై అనుమానాలు వ్యక్తం కావడంతో దేవస్థానం అధికారులు తమ అకౌంట్స్ తనఖీలు చేశారు. ఇందులో రూ 37.90లక్షలు బ్యాంక్ లెక్కల్లో కనిపించకపోగా విచారణ చేశారు. సంబంధిత వేలంల సెక్షన్ అధికారి వాటిని ఖాతాలో జమ చేయనట్లు గుర్తించారు. కొబ్బరికాయలకు సంబంధించి రూ.31.80లక్షలు, కిరాణం రూ.60వేలు, హోటల్ రూ.50వేలు, సులభ్ కాంప్లెక్స్ రూ.2లక్షలు, పూలు, పండ్లు రూ.3లక్షలు ఆయా వ్యాపారుల నుంచి అధికారులు వసూలు చేసినప్పటికీ వాటిని జమ చేయకుండా సొంతంగా వినియోగించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు వసూలు చేసి ఖాతాలో జమ చేయనట్లు తేలడం చర్చ నీయంశంగా మారింది.

దీంతో గతంలోని వాటిని కూడా తనిఖీలు చేయాలనే డిమాండ్లు వెల్లువెత్తుతుండగా దేవాదాయ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో వెంకటేష్‌ను వివరణ కోరగా.. ఖాతాలో జమ చేయనట్లు తమ దృష్టికి వచ్చిందని సదరు ఉద్యోగికి నోటీసు అందించనున్నట్లు తెలిపారు. సదరు వేలంల సెక్షన్ అధికారిని కూడా సంప్రదించే ప్రయత్నం చేయగా ఆయన ఫోన్ స్విచాఫ్ వచ్చింది.

కాంగ్రెస్ హామీలకు నో 'గ్యారెంటీ'

- పథకాల అమలుకు సిద్ధంగా లేని సర్కారు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్, ఫిబ్రవరి 23: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదని మాజీ మంత్రి, బీఆర్ ఎస్ నేత కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. పెద్దపల్లి జడ్పీ చైర్‌పర్సన్ పుట్ట మధుతో కలిసి కాళేశ్వరం ఆలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ప్రత్యేక పూజల అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజలకు బతుకు భరోసా ఇవ్వలేకపోతోందన్నారు. సమస్యలపై ప్రజలు ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి, మంత్రులు మనోభావాలను దెబ్బ తీసేలా మాట్లాడు తు న్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను పక్కన బెట్టి వాటిపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రమంతా సాగు, తాగు నీటిని అందిస్తే దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇంత పెద్ద ప్రాజెక్టులో మేడిగడ్డలో చిన్న పిల్లర్‌లో సమస్య ఏర్పడితే సరిచేసి నీళ్లు అందించాలని గానీ కాలయాపన చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బ్లాక్ మెయిలింగ్, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ చర్యలను ఖండిస్తున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలను విజయవంతం చేయాలి

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 23: కరీంనగర్ ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్‌ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఒలింపిక్ సంఘం ప్యాటరన్, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పోటీల వాల్ పోస్టర్‌ను ఆయన ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే కుంగ్‌ఫూ క్రీడలకు కరీంనగర్ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందన్నారు. కరాటే కుంగ్‌ఫూలతో ఆత్మస్థైర్యం ఆత్మ విశ్వాసం పెంపొందుతా యన్నారు. ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కరాటే కుంగ్‌ఫూలలో శిక్షణ పొందాలని, ముఖ్యంగా అమ్మాయిలు ఇలాంటి విద్యలో శిక్షణ పొందాలని సూచించారు. తొలిసారిగా జిల్లా కేంద్రంలో కుంగ్‌ఫూలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. పోటీల చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, నిర్వాహకులు ఎ శ్రీనివాస్, జూడో సంఘం రాష్ట్ర బాధ్యులు సిలవేరి మహేందర్, ఉషు సంఘం ప్రధాన కార్యదర్శి బార విద్యాసాగర్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు లింగమూర్తి, మోయిన్, కోడూరి శేఖర్, లంక రవివర్మ, సాయిమానేరు ప్రిన్సిపాల్ సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 23: బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించి మాదిగలను గెలిపించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మాదిగల జోడో యాత్రలో భాగంగా శుక్రవారం కరీంనగర్‌కు చేరుకున్న ఆయన నగరంలో యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మోసపూరిత మాటలు విని, ఆయా పార్టీలకు ఓటు వేస్తే తెలంగాణ రాష్ట్రం మతకల్లోలాలు, కింది స్థాయి జాతుల అణచివేతతో రాష్ట్రం తీవ్ర సంక్షోభంలోకి వెలుతుందన్నారు. ఆయా పార్టీలకు ఓటు వేయకుండా సబ్బండ కులాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వంపై ఎన్నడూ ఒత్తిడి చేయలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో మాదిగలను రాజకీయంగా అణచి వేశారని ఆరోపించారు. బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకమన్నారు. అందులో భాగం గానే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి రిజర్వేషన్లను తగ్గించిందని ఆరోపించారు. మళ్లీ బీజేపీకి ఓటు వేస్తే ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా దక్కదన్నారు. రాష్ట్రంలో మాదిగలు బీజేపీని ఓడించడమే 30ఏళ్ల వర్గీకరణకు ఇచ్చే సంపూర్ణ మద్దతు అని అన్నారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని పెంచాలన్నారు. దేశంలో బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం అతి ప్రమాదకరంగా ఉందని, దీనిని కాపాడాల్సిన బాధ్యత చైతన్యవంతులైన మాదిగలపై ఉందన్నారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మెడపట్ల దుబ్బయ్య, అక్కనపల్లి కరుణాకర్, బండ శ్రీను, ఆరెపల్లి అరుణ్‌కుమార్, కనకం వంశీ, గడ్డ యాదయ్య, బొర్రెల్లి సురేష్, షైన ఉపేందర్, ముత్యపాగం నరసింహరావు, ప్రసాద్, నక్క మహేశ్,దేవరకొండ నరేష్, గద్దల రమేశ్, జోగు గణేశ్, మీసాల మహేశ్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 23: పట్టణంలోని సైదాపూర్ రోడ్‌లో గల ఓ మూడతస్తుంతల భవనంలో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి దట్టమైన పొగలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖాధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్న నివాస గృహాల వాళ్లు భయందోళనకు గురయ్యారు.

గొల్లపల్లిలో చోరీ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23: మండలంలోని గొల్లపల్లి , బొప్పాపూర్ గ్రామాల్లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంతో పాటు మొదుసు సత్యంరెడ్డి దుకాణంలో దొంగలు గురువారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. బొప్పాపూర్ సత్తే పీరీల దర్గా సమీపంలోని సత్యంరెడ్డి దుకాణం తాళాలు పగలగొట్టి రూ.3 వేల విలువైన కూల్ డ్రింక్స్ సిగరెట్ ప్యాకెట్లు, ఇతర తినుబండారాలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రమాకాంత్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



ప్రభాకర్ (ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 23: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని గన్నెవానిపల్లె పరిధిలోని నిమ్మవానిపల్లెలో శుక్రవారం విద్యుదాఘాతం తో నిమ్మల ప్రభాకర్(42) మృతి చెందా డు. ప్రభాకర్ తన పొలం వద్ద గడ్డికోయడానికి వెళ్లగా, బోరు మోటార్‌కు వచ్చే సపోర్ట్ వైరుకు విద్యుత్ సరఫరా అవడంతో గమనించని ప్రభాకర్ వైరుకు తగలడంతో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముస్తాబాద్, ఫిబ్రవరి 23 : మండలంలోని బంద నకల్ గ్రామానికి చెందిన అల్మాస్‌పూర్ ఆశయ్య (52) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై శేఖ ర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా అనా రోగ్యంతో బాధ పడుతున్న ఆశయ్య మనస్తాపంతో ఈనెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేటలోని ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణిం చాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఆశయ్య కూతు రు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

రుద్రంగి, ఫిబ్రవరి 23: రుద్రంగి మండలం దేగవాత్ తండా గ్రామంలోని కున్‌సోత్ తండాకు చెందిన కున్‌సోత్ ముత్యాలి (90) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొద్ది సంవత్సరాలుగా ముత్యాలి అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

జగిత్యాల టౌన్ సీఐ నటేశ్ సస్పెన్షన్

జగిత్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ సీఐగా పనిచేస్తున్న నటేశ్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ -1 ఐజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి, క్రైం బర్కింగ్ ఆరో పణల్లో విచారణ జరిపిన నేపథ్యంలో నటేశ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. పోలీస్ స్టేషన్ వచ్చిన ఫిర్యాదులను పట్టించుకోకపోవడం, కేసులు నమోదు చేయకుండా జాప్యం వహించ డం, అవినీతికి పాల్పడడం వంటి ఆరోపణలపై ఇటీవల పోలీసు ఉన్నతాధికారులు నటేశ్‌పై విచారణ జరిపించినట్లు సమాచారం. నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి ఇజ్రాయిల్ దేశానికి పంపిస్తానని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యవహారంలో సీఐ నటేశ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై విచారణ జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా జగిత్యాల పట్టణ సీఐగా పనిచేస్తున్న నటేశ్‌ను ఇటీవల బదిలీ చేయగా రాజకీయంగా ఒత్తిడి తెచ్చి బదిలీని నిలిపివేయించుకోవడం సైతం ఉన్నతాధికారుల అసంతృప్తికి కారణమైందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సీఐ నటేశ్ సస్పెండ్ వ్యవహారం పోలీసువర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

చిరుత దాడిలో మేక మృతి

చందుర్తి, ఫిబ్రవరి 23 : చందుర్తి మండలం లింగంపేట శివారులో చిరుత పులి సంచారం మండల ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. మండలంలోని లింగంపేట అటవీ ప్రాంతం శివారులో చిరుతపులి దాడిలో మేక మృతి చెందినట్లు అటవీ శాఖ బీట్ ఆఫీసర్ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. లింగంపేట అటవీ ప్రాంతంలో గ్రామంలోని ఈగ రాజేశంకు చెందిన మేక మృతి చెందిన విషయాన్ని గ్రామస్థులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందజేశారు. అటవీ ప్రాంతం శివారులో మృతి చెందిన మేకను పరిశీలించగా చిరుతపులి దాడి చేసినట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

గల్ఫ్‌లో బొప్పాపూర్ వాసి హఠాన్మరణం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23:ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల రాజు(45) బహ్రయిన్‌లో గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నిమ్మల రాజు 15 ఏళ్లుగా బహ్రయిన్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, రోజులాగే విధులకు వెళ్లిన అతను ఛాతిలో నొప్పితో అస్వస్థతకు గురయ్యాడన్నారు. మిత్రులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని తెలిపారు. పరీక్షించిన అక్కడి వైద్యుడు గుండెపోటుతో చనిపోయాడని నిర్ధారించారన్నారు. ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ కాలువలో పడి వృద్ధురాలు మృతి

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 23 : పట్టణానికి చెందిన సిర్ప సుజాత(60) శుక్రవారం ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందిం దని ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సిర్ప సుజాతకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం భర్త లక్ష్మీనారాయణ, కుమారుడు మృతి చెందారు. ఇద్దరు కూతుళ్లకు వివాహం జరగగా సుజాత పట్టణంలోని కూరగాయాల మార్కెట్ ఏరియాలో ఉంటోంది. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది.ఆసుపత్రులకు వెళ్లినా నయం కాకపోవడంతో మానసికంగా ఇబ్బంది పడుతోంది. శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు పట్టణంలోని ఎస్సారెస్పీ కాలువలో పడి కొట్టుకుపోతుండగా సమీపంలోని వారు చూసి బయటకు తీసి ఆసపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. సుజాత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



వహానకొండూర్, ఫిబ్రవరి 23 : మండలంలోని దేవంపల్లి గ్రామంలో గల కాకతీయ డిబిఎం 6 ఉపకాల్వలో శుక్రవారం ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కాకతీయ ప్రధాన కాల్వ నుంచి డీబీఎం 6 ఉపకాల్వలో ఓ వ్యక్తి మృత దేహాన్ని గ్రామస్థులు గుర్తించి కాల్వలో నుంచి బయటికితీసారు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న సీఐ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


తల్లుల ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు


తల్లుల దర్శనం కోసం క్యూ లైన్లలో బారులుదీరిన భక్తులు


తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ క్యూ లైన్లలో జనం


తిరుగుపయనమైన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్లు, భక్తులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు


మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయిన గద్దెల ప్రాంగణం

భక్త జన హోరు..



▸▸ వనదేవతల రాకతో పోటెత్తిన భక్తులు ▸▸ నిరంతరాయంగా దర్శనాలు ▸▸ మొక్కులు చెల్లించుకున్న సీఎం, గవర్నర్

మేడారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతుండగా తరలివస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం పోటెత్తుతోంది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీ ప్రవేశ ద్వారాల వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వేచిచూస్తుండడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మరింత జోరందుకుంది.

ప్రముఖుల తాకిడి

జాతరలో శుక్రవారం వీఐపీల తాకిడి పెరిగింది. ప్రముఖులంతా ఈ రోజే రావడంతో అధికారులపై ఒత్తిడి కనిపించింది. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్కను దర్శించుకొని మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం గవర్నర్‌తోపాటు కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు చీరెలను సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి





హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్‌వీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ సీఎం శాంతికుమారి తదితరులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్క సీఎంకు స్వాగతం పలకగా అధికారులు ఆలయ మర్యాదలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు తల్లులను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర

గద్దెలపై కొలువుదీరి భక్తులకు ఆశీస్సులం దిస్తున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. దీంతో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తెరపడనుంది. శనివారం సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు మిగతా పూజారులు సమ్మక్క గద్దె వద్దకు చేరుకొని చివరి పూజలు చేసి.. తల్లి రూపాన్ని తీసుకొని చిలకలగుట్టపైకి తీసుకువెళ్లి నిజస్థానంలో ఉంచి వెనుదిరుగుతారు.

శునకానికి నిలువెత్తు బంగారం


హుజూరాబాద్‌లో శునకానికి నిలువెత్తు బంగారం

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 23: శ్రీసమ్మక్క-సారలమ్మకు భక్తులు నిలువెత్తు బంగారం (బెల్లం) ఇచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన హరీష్ తన పెంపుడు శునకానికి నిలువెత్తు బంగారాన్ని సమర్పించేందుకు మొక్కుకున్నాడు. ఈ మేరకు హుజూరాబాద్ పట్టణంలోని ఓ షాపులో శునకంను త్రాసులో కూర్చోబెట్టగా 5కిలోల బంగారం తూగింది. శుక్రవారం కుటుంబ సమేతంగా శ్రీసమ్మక్క- సారలమ్మ తల్లులకు ఎత్తు బంగారం సమర్పించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 23: హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ దంపతులు పాల్గొని రెండోరోజు పూజ కార్యక్రమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిమ్మాపూర్, ఫిబ్రవరి23: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు అలుగునూర్ సబ్‌స్టేషన్ ట్రాన్స్‌కో ఏఈ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవి అలుగునూర్ సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్, ఇతర సమస్యలతో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాడుతుందని కావున అలుగునూర్, తిమ్మాపూర్, మహాత్మానగర్, ఎల్‌ఎండి గ్రామ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముల్కనూరు ప్రజాగ్రంథాలయానికి పుస్తకాల వితరణ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 23: జిల్లాకు చెందిన రచయిత, కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ శుక్రవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ ప్రజా గ్రంథాలయానికి 250 పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాటి మనిషిని ప్రేమించే గుణం, సమాజాన్ని అర్థం చేసుకునే శక్తి కేవలం ఉత్తమ పుస్తకాలు చదవడంతోటే లభిస్తుందని అన్నారు. వారాల ఆనంద్ రచించిన మనిషి లోపల, అక్షరాల చెలిమె లాంటి 12 పుస్తకాలను, సుమారు 20 వేల రూపాయల విలువైన అరుదైన సాహిత్య చరిత్ర పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి గొల్లపల్లి లక్ష్మయ్య, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, డాక్టర్ తాళ్ల వీరేశం, మెట్టు సుగంధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయానికి వంట పాత్రల బహూకరణ


వంట పాత్రలను ఇస్తున్న పీవీ సేవా సమితి సభ్యులు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలోని దుర్గాదేవి ఆలయానికి శుక్రవారం పీవీ సేవా సమితి, అలయన్స్ క్లబ్ సభ్యులు రూ. 10 వేలు విలువ చేసే వంట సామగ్రిని ఆలయ పూజారి కిషోర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీవీ సేవా సమితి అలయన్స్ అధ్యక్షులు తుము వెంకట్‌రెడ్డి, బి. మనోజ్, వైద్యులు రామలింగారెడ్డి, తొగరు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి మాధవరావు, కన్నయ్య, సీడ్స్ సంపత్‌రావు, సాగి శివప్రసాద్ రావు, గౌరి శంకర్, చొక్కారెడ్డి, రాకేష్, కుమార్, నగేష్ తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎంపీ బండి సంజయ్‌కుమార్


బాధితులను పరామర్శిస్తున్న ఎంపీ బండి సంజయ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 23: నగరంలోని ఆదర్శనగర్ అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం అగ్ని ప్రమాదంలో దగ్ధమైన గుడిసెవాసులు, బాధిత కుటుంబాలను పరామర్శించారు. అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయామని బాధితులు అన్నారు. కష్టపడి దాచుకున్న బంగారంతో పాటు, ఉపాధి కల్పిస్తున్న యంత్రాలు, వాహనాలు సైతం అగ్నికి ఆహుతయ్యాయన్నారు. తినడానికి తిండిలేని సమయంలో తాత్కాలికంగా బసతో పాటు, భోజన వసతి కల్పించిన ఎంపీకి రుణపడి ఉంటామన్నారు. నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి అందించారని, అగ్నికి సర్వం కోల్పోయామని, మళ్లీ గుడిసెలు వేసుకోవాలనుకుంటున్నామని తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

అగ్ని ప్రమాద బాధితులతో బండి సంజయ్ మాట్లాడుతూ వారి సమస్యలను సానుకూలంగా స్పందించి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గుడిసెలు వేసుకుని తిరిగి జీవనం సాగించేందుకు అవసరమైన సహాయసహకారాలు అందిస్తామన్నారు. నగరంలో రెండు దశాబ్దాలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారన్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లిన సమయంలో వారు నివాసం ఉంటున్న గుడిసెలన్ని దగ్ధమయ్యాయన్నారు. నిత్యావసర వస్తువులు, బంగారం, కోల్పోయారన్నారు. తిరిగి వారికి గుడిసెలు వేసుకునేందుకు సాయం అందిస్తామన్నారు. ఉపాధికి అవసరమైన యంత్రాలను అవసరమైన మేరకు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం వారికి అన్నివిధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుగ్గిళ్లపు రమేష్, కొలగాని శ్రీనివాస్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్యనందిత మృతిపై నేతల సంతాపం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 23: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంపై పలువురు నేతలు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని, చిన్నవయసులోనే లాస్యనందిత మరణించడం బాధాకరమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. లాస్య ఆత్మకుశాంతి కలగాలని, ఆమె కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం కలిగించాలని సంజయ్ ప్రార్థించారు. ఎమ్మెల్యే లాస్యనందిత మృతిచెందడం బాధాకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. లాస్యనందిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, ఆమె పవిత్ర ఆత్మకుశాంతి చేకూరాలని కాంక్షించారు. అలాగే మేయర్ యాదగిరి సునీల్‌రావు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

కరీంనగర్ అర్బన్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంపై డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా ఎన్నికై మూడు నెలలు గడవక ముందే దుర్మరణం చెందడం అత్యంత బాధాకరమన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

భగత్‌నగర్, ఫిబ్రవరి 23: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 22, 23 తేదీల్లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో కరీంనగర్ జిల్లా రిపోర్టను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. ధరణి సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రైతుబంధు వెంటనే విడుదల చేయాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న భూ పోరాటంలో పెట్టిన కేసులను ఎత్తి వేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రతినిధులు గీట్ల ముకుందరెడ్డి, వర్ణవెంకట్‌రెడ్డి, గుడికందుల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి 'బండి' మలిదశ ప్రజాహితయాత్ర

- కోహెడ నుంచి యాత్రకు శ్రీకారం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 23: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ రెండో విడత ప్రజాహితయాత్రకు సమాయత్తమవుతున్నారు. ఈనెల 26న హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహెడ మండల కేంద్రంలో మలిదశ యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రతిరోజు సగటున 10 గ్రామాల్లో పాదయాత్ర చేసే విధంగా రూట్ మ్యాప్‌ను ఖరారు చేసుకున్నారు. శుక్రవారం కరీంనగర్‌లో ఆయన పార్టీ నేతలతో సమావేశమై మలిదశ ప్రజాహిత యాత్రపై చర్చించారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి మార్చి ఒకటవ తేదీ వరకు హుస్నాబాద్, హుజురాబాద్ నియోజకవర్గాల్లో యాత్రను కొనసాగిస్తారు. మొదటిరోజు కోహెడ నుంచి యాత్రను ప్రారంభించి తీగలగుంటపల్లి, గోటమిట్ల, నారాయణపూర్, విజయనగర్‌తోపాటు చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి, చిన్న ముల్కనూర్, చిగురుమామిడి, రేకొండ బొమ్మనపల్లి గ్రామాల్లో పాదయాత్ర చేస్తారు. రాత్రి బొమ్మనపల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో సంజయ్ బస చేస్తారు. రెండో రోజు హుస్నాబాద్ రూరల్ మండలంలోని మహ్మదాపూర్, నాగారం, పోతారం, హుస్నాబాద్, పందిళ్ల, గోవర్ధనగిరి, రామవరం, అక్కన్నపేట, అంతక్కపేట, కట్కూర్, మల్లారం కొత్తకొండ గ్రామాల్లో పర్యటిస్తారు. మార్చి 2 వరకు హుస్నాబాద్, హుజురాబాద్ నియోజకవర్గాల్లో ప్రజాహిత యాత్రను పూర్తిచేసేలా రూట్‌మ్యాప్ రూపొందించుకున్నామని, యాత్రలో పార్టీశ్రేణులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని సంజయ్ కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఇంచార్జి మీసాల చంద్రయ్య, మాజీ మేయర్ డి శంకర్, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు స్టీలు రేకులు అందజేత


రేకులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 23: కరీంనగర్ ఆదర్శనగర్‌లో మూడు రోజుల కిందట జరిగిన అగ్నిప్రమాదంలో గుడిసెలు మంటల్లో కాలిపోగా బాధితులకు లక్ష రూపాయలు విలువచేసే స్టీల్ రేకులను మాజీ కార్పొరేటర్ నడిపెల్లి అశోక్‌రావు, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్‌తో కలిసి శుక్రవారం అందజేశారు. అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల ఘటన స్థలానికి చేరుకుని గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలను పరామర్శించి, బాధితులకు కావాల్సిన సామగ్రి అందజేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు నడిపెల్లి అశోక్ రావు, అంజన్ కుమార్‌లను ఆదేశించగా ఈ మేరకు బాధితులకు సహాయం అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ భువనగిరి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రాబోయే రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరెళ్ల ప్రసాద్, న్యాయవాది కొమురయ్య, గౌరిశెట్టి రాంబాబు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

గణేష్‌నగర్, ఫిబ్రవరి 23: జిల్లావ్యాప్తంగా విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ ఎస్ఈ వడ్ల కొండ గంగాధర్ అన్నారు. శుక్రవారం నగరంలోని వైశ్యభవన్‌లో కరీంనగర్ టౌన్, రూరల్ డివిజన్ ఓ అండ్ ఎం స్టాఫ్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న వేసవి కాలంలో నిరంతరాయం విద్యుత్ సరఫరా అందించడానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. సమావేశంలో కరీంనగర్ డివిజన్ ఇంజనీర్స్ విజయేందర్‌రెడ్డి, రాజం తిరుపతి, ఏడీలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్యాకెట్ల పంపిణీ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 23: నగరంలోని రేకుర్తిలో నిర్వహిస్తున్న సమ్మక్కజాతరలో కేపీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నాల తిరుపతి ఆధ్వర్యంలో వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గంగాధర రవి, దుర్సెటి నాగరాజు, పొన్నాల జ్యోతి, సట్టు నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలపై చర్యలు చేపట్టాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 23: భూ కబ్జాలు, అక్రమ వ్యాపారం, నేరస్తులపై జిల్లా వ్యాప్తంగా చర్యలు చేపట్టాలని సిఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ కోరారు. నగరంలో నేరస్తులపై ఉక్కు పాదం మోపడం అభినందనీయమని, జిల్లా వ్యాప్తంగా ఉన్న అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని పోలీస్‌కమిషనర్‌ను విజ్ఞప్తి చేశారు.

నిధుల దుర్వినియోగం, భూకబ్జాపై విచారణ

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 23: కొత్తపల్లి మండలం ఎలగందల్‌లో నిధుల దుర్వినియోగం, ప్రభుత్వ భూమి కబ్జాపై కొత్తపల్లి ఎంపీవో శ్రీనివాస్ శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కారోబార్ అజయ్‌కుమార్‌ను విచారించారు. వారి నుంచి లిఖితపూర్వంగా వివరణ తీసుకుని ఉన్నతాధికారులకు సమర్పించనున్ననట్లు విచారణ అధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంద రమేష్‌గౌడ్, కార్యదర్శి గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి భోజనాలు

భగత్‌నగర్, ఫిబ్రవరి 23: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ బస్టాండ్‌లో మధ్యాహ్న భోజన కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. మేడారం జాతర సందర్భంగా ఇతర డిపోల నుంచి వచ్చిన ఆర్టీసీ సిబ్బందికి అల్పాహారంతో పాటు, భోజనాన్ని లయన్స్‌క్లబ్ ద్వారా అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చీఫ్ ఆర్డినేటర్ రావికంటి కృష్ణకిషోర్, లయన్ చింతలకిషన్, గుంటక ప్రకాశ్, కరుణాకర్, స్వప్న, సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి కరీంనగర్-1,2 డిపో మేనేజర్‌లు లక్కు మల్లేశం, వి మల్లయ్య, లక్ష్మీరాజం, వీరస్వామి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ సభ్యులకు రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్ భూపతిరెడ్డి, కె సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మక్కను దర్శించుకున్న ఎంపీపీ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 23: కొత్తపల్లి మండలంలోని చింతకుంట సమ్మక్క సారలమ్మ దేవతలను కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. ప్రజలందరికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, చల్లగ చూడాలని, వర్షాలు సకాలంలో కురువాలని, రైతులకు పంటలు బాగా పండి సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు ఎంపీపీ తెలిపారు.